

దర్గా గ్రామంలో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్

పేదల సంతోషం కోసమే

సన్నబియ్యం పంపిణీ

- జిల్లా వ్యాప్తంగా 5,775 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- కలెక్టర్ మనుచౌదరి
- దర్గా గ్రామంలో లబ్ధిదారుడి ఇంట్లో కలెక్టర్, అధికారులు భోజనం

కొండపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పేదవారు సంతోషంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. కొండపాక మండలం దర్గా గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారుడు తలపాక శ్రీనివాస్- పుష్ప దంపతుల ఇంట్లో రేషన్ ద్వారా తీసుకున్న సన్నబియ్యంతో వండిన అన్నంను శ్రీనివాస్ దంపతులు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజతో కలెక్టర్ భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సన్నబియ్యంతో లబ్ధిదారులు సంతోషంగా కడుపునిండా తినగలుగుతున్నారని పేర్కొన్నారు. పేదవారు కడుపునిండా ఆనందంగా తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లబ్ధిదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తుందని చెప్పారు. రేషన్ కార్డు ద్వారా అందజేసిన సన్నబియ్యంతో వండిన ఆహారం చాలా బాగుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,775 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో సన్న బియ్యం తీసుకున్న వారందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

టాటా కంపెనీ సహకారంతో

'ఏటీసీ' ఏర్పాటు!

హుస్నాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ లోని కిషన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలీటెక్నిక్ కళాశాలలో టాటా కంపెనీ సహకారంతో ఏటీసీ (అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్)ను ఏర్పాటు చేయనున్నారు. పాలీటెక్నిక్ కళాశాల సమీపంలోని 1.20ఎకరాల్లో నిర్మించనున్నారు. ఈ విషయమై ఇటీవల సంబంధిత అధికారులు కళాశాలను పరిశీలించినట్లు సమాచారం. ఇందులో ఏఏ కోర్సులు..? ఈ అకాడమిక్ ఇయర్‌లో ప్రారంభిస్తారా..? అనే విషయాలు ఇంకా వెల్లడికాలేదు. ఇటీవల హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కాగా, ఏటీసీ కళాశాలకు ఏర్పాట్లు జరుగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'వికాసం'కు విఘ్నాలు

మొరాయిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం సర్వర్

కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీకి తప్పని సమస్య

8



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

యూడీఐడీపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చేయూత, పింఛన్‌దారులకు కొత్తగా వచ్చిన యూడీఐడీ యాప్ (యూనిక్యూ డిజబులిటీ ఐడెంటీ కార్డు)పై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన మండల పరిషత్ అధికారులు, పంచాయతీ, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు యూడీఐడీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కొత్తగా వచ్చిన యాప్ ద్వారా సదరన్ పింఛన్‌దారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా వర్తిస్తుందని చెప్పారు. గతంలో సదరన్ సర్టిఫికెట్ పొందిన వారికి 7 రకాల అప్పులు ఉండేవని కొత్తయాప్ ద్వారా 21 రకాల పరీక్షలు పొందే అవకాశం ఉందన్నారు. గ్రామస్థాయిలోనే యూడీఐడీ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 22 వరకు జిల్లావ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ పోషన్ అభియాన్ ద్వారా పోషకాహారం అందించే విధంగా పోషణ పక్షోత్సవాలు జరుగుతున్నాయని, వీటిని విజయవంతం చేయాలన్నారు. ఉపాధి పథకంలో ప్రతి కుటుంబానికీ 120 రోజులు పనిదినాలు కల్పించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం పోషక అభియాన్‌పై ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా, మండల ప్రత్యేక అధికారి జగత్‌కుమార్, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

- కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత
- ప్రభుత్వ డిగ్రీ, మహిళా ప్రభుత్వ డిగ్రీ, కళాశాల సందర్శన

7

మెప్మా ఇదేమిటి చెప్మా!

మహిళలు ఆర్థికంగా, స్వయం ఉపాధి ద్వారా రాణించాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందించి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నాయి. రుణాలు అందించి వారికి అండగా నిలవాల్సిన పలువురు మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారు. సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సిబ్బంది ఓ మహిళా సంఘం పేరిట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఆ ఇద్దరిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. దురాశతో మహిళ సంఘం పేరిట లబ్ధి పొందేందుకు యత్నించినట్లు తేలడంతో రాష్ట్ర మెప్మా కార్యాలయానికి వారిని సరెండర్ చేశారు. కొన్నేళ్లుగా సిద్దిపేట మెప్మా కార్యాలయంలో పాతుకుపోయిన సిబ్బందిని సరెండర్ చేశారని తెలియడంతో అటు మహిళ సంఘాల సభ్యుల్లో, ఇటు మెప్మా మున్సిపల్ కార్యాలయంలో చర్చాంశనీయంగా మారింది.

- ఐదు మున్సిపాలిటీల్లో 4,243 మహిళ సంఘాలు
- మహిళా సంఘం గ్రూపు పేరిట లబ్ధి పొందేందుకు యత్నించిన మెప్మా సిబ్బంది
- సిద్దిపేటలో ఓ మహిళ సంఘం నుంచి అనుమతి లేకుండా సభ్యుల పేర్లు తొలగింపు
- ఎందుకు సంఘం నుంచి వెళ్తున్నారని సభ్యులను ఆరా తీసిన అధికారులు
- తామెందుకు వెళ్తామని కంగుతిన్న సభ్యులు
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇద్దరు మెప్మా సిబ్బంది
- వారిపై వేటు వేస్తూ రాష్ట్ర మెప్మా కార్యాలయానికి సరెండర్ చేసిన కలెక్టర్
- చర్చాంశనీయంగా మారిన సిబ్బంది పనితీరు



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం



మెప్మా కార్యాలయం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపల్‌లో మొత్తంగా 4,243 మహిళ స్వయం సహాయక సంఘాలుండగా, 43,651 మంది సభ్యులున్నారు. వీటిలో సిద్దిపేటలో 2,199 సంఘాలకు గానూ 22,316 మంది, గజ్వేల్‌లో 649 సంఘాలకు 6,568 మంది, హుస్నాబాద్‌లో 503 సంఘాలకు 5,343 మంది, దుబ్బాకలో సంఘాలకు 6,187 మంది, చేర్యాలలో 306 సంఘాలకు 3237 మంది మహిళా సభ్యులున్నారు. మహిళా సంఘాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.55కోట్ల రుణాల లక్ష్యానికి గానూ రూ. 56 కోట్ల మేరకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను అందించారు.

తక్కువ వడ్డీ ఆశతో..

కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న టీఎంసీపై తీరుపై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా మహిళా సంఘం సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి సంఘం నుంచి రుణాలను లబ్ధి పొందేందుకు యత్నించిన ఉద్యోగులపై అటు పట్టణంలోని మహిళ సంఘాలు, మున్సిపల్ కార్యాలయంలో చర్చింకుంటున్నారు. మహిళ సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రూ. లక్ష నుంచి రూ. 20 లక్షల లోపు రుణాలను అందిస్తున్నారు. వీటిని పావులా వడ్డీకి రుణాలు అందజేస్తుండటంతో అతి తక్కువ వడ్డీ కావడంతో లబ్ధి పొందేందుకు చేశారా? అంటూ పలువురు మహిళా సంఘాల సభ్యులు గుసగుసలాడుకుంటున్నారు.

లబ్ధి పొందేందుకు

సిద్దిపేట మున్సిపల్ మెప్మా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ (టీఎంసీ), మరో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) ఉద్యోగినితో కలిసి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పట్టణానికి చెందిన ఓ మహిళా సంఘంలోని ఐదుగురు సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి తొలగించారు. ఈ మేరకు తీర్మానం చేసిన ప్రతిని సిద్దిపేట జిల్లా డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ (డీఎంసీ), ఉన్నతాదికారులకు పంపించారు. దీంతో తీర్మానం చేసిన ప్రతిలో ఒకే చేతిరాతతో సంతకాలు ఉండటంతో అనుమానం వచ్చిన అధికారులు సంబంధింత తొలగించిన సభ్యులను, సంఘం నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారంటూ ఆరా తీశారు. తాము సంఘం నుంచి వెళ్లిపోవడమేమిటని సభ్యులు కంగుతిని, తాము సంఘంలోనే ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. సంఘంలో నుంచి ఐదుగురిని తీసేసి వారి స్థానంలో వేరే పేర్లతో (డమ్మీ సభ్యులు) సంఘంలో పేర్లు నమోదు చేసి రుణాల లబ్ధిపొందేందుకు యత్నించినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. సిద్దిపేట మున్సిపల్ మెప్మా టీఎంసీ, సీవోలు కలిసి ఇదంతా చేశారని తేలగా వారిని రాష్ట్ర మెప్మా కార్యాలయానికి సరేండర్ చేస్తూ రిలీవ్ ఉత్తర్వులను జారీచేశారు.

కొరవడిన అధికారులు పర్యవేక్షణ

జిల్లాలోని పలు మున్సిపల్ కార్యాలయాల్లో మెప్మాలోని టీఎంసీలు, సీవోలు, ఆర్పీలు ఆడింది ఆట పాడింది పాటగా కొనసాగుతున్నా, వారి ఆగడాలకు అధికారులు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారు. ప్రతినెలా మెప్మా సిబ్బందితో కలిసి రుణాలు కేటాయించడం, తిరిగి చెల్లించడం వంటి వాటిపై దృష్టి సారించడం లేదు. మెప్మా కార్యాలయంలో సిబ్బంది కొరత కూడా ఓ సమస్యగా మారింది. అనుకున్న మేరకు సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ కార్యాక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్తున్న మెప్మా సిబ్బందిని పెంచడంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మెప్మా సిబ్బందితో ప్రతి నెలా సమీక్షలు జరిపి మహిళ సంఘాలకు అభ్యున్నతి కోసం కృషిచేయాలని పలువురు సభ్యులు కోరుతున్నారు.

ఎన్నికల్లో బీజేపీ గెలవాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఉపాధ్యాయ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీల ఆత్మీ య అభినందన సభలో ఆయన మాట్లాడారు. గతంలో బీజేపీని ఎద్దేవా చేసిన కాంగ్రెస్ నేడు మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉందన్నారు. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమని చెప్పిన రేవంత్‌రెడ్డికి ఓటమి చూపించింది బీజేపీ అని తెలిపారు. ప్రపంచంలో పెద్దదేశంగా చూపించే అమెరికా కూడా మోదీకి పెద్దపీట వేసిందని కొనియాడారు. హెచ్‌సీయూ భూమిపై కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని తెలిపారు. గెలిచిన 15 నెలల్లో కాంగ్రెస్ అతిపెద్ద వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. తప్పు చేసిన బీజేపీ ఎంపీలు ఎవరో కేటీఆర్ తేల్చాలని అన్నారు.

లెక్క తేల్చడం లేదు!

- మల్లన్న ఆలయ వార్షిక ఆదాయ, వ్యయాల వివరాల వెల్లడిలో జాప్యం!?
- గత మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం
- రెండువారాలు కావస్తున్నా వెల్లడించని నికర ఆదాయం
- లెక్కల సర్దుబాటుపై ఆరోపణలు

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ వార్షిక ఆదాయ, వ్యయాల వివరాల వెల్లడిలో జాప్యం వహిస్తుండడం పట్ల ఆలయవర్గాలతీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024-25 ఆర్థికసంవత్సర గడువు గత మార్చి 31తో ముగిసింది. ఏడాది పాటుగా నిర్వహించిన లావాదేవీలు, ఆదాయ, వ్యయాల వివరాలను పొందుపరుస్తూ నివేదిక రూపొందించి లాభనష్టాలను వెల్లడించాల్సి ఉంటుంది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసిన మొదటివారంలోగా ఈతంతు పూర్తిచేయాలి. ఇప్పటికే రెండు వారాలు గడుస్తున్నా వెల్లడించకపోవడంతో సర్దుబాటు కోసమే జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతేడాది డిసెంబరు 29న జరిగిన స్వామి వారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవగా 10 వారాల పాటు కొనసాగిన జాతరలో 12 లక్షల మందికి పైగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాధారణ రోజుల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చి దం డిగా కానుకలు సమర్పించడంతో బుకింగ్ ఆదాయంతో పాటు హుండీ లెక్కింపులలో రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. కానీ ఆయా లావాదేవీలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తి లెక్కల సంగతి తేల్చకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆలయానికి వేలంపాట, ఇతర మార్గాల్లోనూ సమకూరుతుండగా వేలంపాటదారుల నుంచి ఇప్పటికీ బకాయిలు వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలువురు చెల్లించలేదు. నిర్ణీత సమయంలోనే క్యాష్‌బుక్ క్లోజ్ చేసినప్పటికీ ఇంకా రికార్డుల దిద్దుబాటు పనిలో కసరత్తు చేస్తున్నారు. దీంతో నిర్వహణ ఖర్చులు పోను నికర ఆదాయం ఎంత వ చ్చేది, లేదన్న విషయమై ఆలయవర్గాలు మల్లగుల్లాలు పడుతున్నారు.. యేటా సమకూరిన నికర ఆదాయంలో నుంచి స్వామివారి పేరిట డిపాజిట్ చేస్తున్నారు. కానీ కొద్దిరోజులక్రితం స్థానికంగా జాతీయ బ్యాంకులు అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లాకేంద్రంలోని ఓ బ్యాంకులో కోటికిపైగా డిపాజిట్ చేయగా, ప్రస్తుత ఆదాయ, వ్యయాల బేరీజుతో మల్లన్న పేరిట డిపాజిట్ చేస్తారా లేదా అన్న విషయం చర్చనీయాంశమైంది. గతేడాది రూ.45కోట్లు టర్నోవర్‌తో రూ.18.70కోట్లు ఆదాయం సమకూరగా, ఈ ఏడాది చోటుచేసుకున్న పరిస్థితుల కారణంగా ఎంత టర్నోవర్‌కు చేరుకుని మరెంత ఆదాయం వస్తుందన్నది ఆసక్తి కలిగిస్తుంది.

మల్లన్న ఆలయంలో వేలం వాయిదా

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మల్లన్న ఆలయంలో శుక్రవారం నిర్వహించిన వేలంపాటలు వాయిదా పడ్డాయి. ఈసందర్భంగా భక్తుల సెల్‌ఫోన్ డిపాజిట్, షాపింగ్‌కాంప్లెక్స్ లీజుతో పాటు మ్యాన్‌పవర్ సరఫరాకు స్టీల్‌టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు జరిపారు. మ్యాన్‌పవర్ సరఫరాకు ఒక షెడ్యూల్ రాగా, షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు నిబంధనల ప్రకా రం షెడ్యూల్ దాఖలు కాలేదు. సెల్‌ఫోన్ డిపాజిట్‌కు షెడ్యూల్ దాఖలు కాకపోవడంతో అన్నింటిని వాయిదా వేశారు. కార్యక్రమంలో ఈవో అన్నపూర్ణ, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ. 8,01,105

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. అమ్మవారికి భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి 59 రోజులకు రూ. 8,01,105 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చేయనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత రమేష్, డైరెక్టర్‌లు చెక్కల నరేశ్, ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్ధన్ ఉన్నారు.

జూన్‌లోగా ఫ్యాక్టరీ పూర్తవ్వాలి

- మంత్రిగా సచివాలయంలో చేసిన తొలి సంతకం ఈ ఫ్యాక్టరీదే
- వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- ఆయిల్‌పామ్ సాగుపై కలెక్టర్ ప్రతీవారం సమీక్షించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- క్షీర విప్లవం తెచ్చిన కురియన్ ఎట్లనో.. ఆయిల్‌పామ్‌లో తుమ్మల అట్ల
- మంత్రి పొన్నం ప్రభాకర్





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మంత్రి పొన్నం

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): "నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి.. సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సంతకం నంగునూరు మండలం నర్మేటలో నిర్మించే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీదేనని" వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. లేటెస్ట్ టెక్నాలజీతో ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలోనే మోడల్‌గా ఈ ఫ్యాక్టరీ రూపుదిద్దుకోవాలని కోరారు. శుక్రవారం నంగునూరు మండలం రూ.300కోట్లతో చేపట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ ఫ్యాక్టరీని 65 ఎకరాల్లో రూ.300కోట్లతో నిర్మిస్తున్నామని, జిల్లాలో మూడు ఆయిల్‌పామ్ నర్సరీలు ఉన్నాయని, 12,300 ఎకరాల్లో సాగవుతుందని కలెక్టర్ మనుచౌదరి మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... రాష్ట్రంలోనే ఏకైక ఆయిల్‌పామ్, రీఫైనరీ ఫ్యాక్టరీ ఇదని, రాష్ట్రంలో అత్యధిక కెపాసిటీతో అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని, పంట విస్తీర్ణం పెంచడంపై ప్రతీ వారం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సిద్దిపేట జిల్లా తెలంగాణ రాష్ట్రం మధ్యలో ఉందని అన్ని ప్రాంతాలకు అనుకూలమని, సిద్దిపేట మోడల్‌గా ఉండాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు అన్నిరకాల సబ్సిడీలు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటలకు ఎకరానికి రూ.51వేలు, 4 సంవత్సరాలు అందిస్తున్నామని తెలిపారు. జూన్ నెలాఖరు వరకు ఈ ఫ్యాక్టరీ ప్రారంభించాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తూ దిగుబడి తీస్తున్న రైతులను తీసుకురాకపోవడంతో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.



కొనసాగుతున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు

ఆర్థికంగా ఎదగాలి : మంత్రి పొన్నం

ఇటీవల గుజరాత్‌లో ఆయిల్ డెయిరీ ఫ్యాక్టరీని పరిశీలించామని స్వాతంత్ర్యం రాక ముందు కురియన్ క్షీర విప్లవం తీసుకొచ్చారని, క్షీర విప్లవం తెచ్చిన కురియన్ ఎట్లానో.. ఆయిల్ పామ్‌లో తుమ్మల అట్లా అని మంత్రి తుమ్మలను మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. మంత్రి వర్గంలో విశేష అనుభవం ఉండి స్వయంగా 200 ఎకరాల్లో పామ్‌ఆయిల్ పెట్టిన తుమ్మల నాగేశ్వరరావు రైతులకు మార్గదర్శకత్వం చేయాలన్నారు. తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న యజ్ఞంలో మనమంతా భాగస్వామ్యం కావాలని తెలిపారు. సిద్దిపేట పక్కన ఉన్న కరీంనగర్, సిరిసిల్ల, జనగామ, వరంగల్ వారు కూడా ఆయిల్‌పామ్ వేసి ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. అనంతరం వెంకటాపూర్, ముండ్రాయిలలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, వ్యవసాయ శాఖ, ఉద్యాన వనశాఖ సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నుంచి సాయం అందిస్తాం..

చిన్నకోడూరు : పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వపరంగా సాయం అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న పంటలను శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వెంటనే ప్రభుత్వానికి పంపించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 24 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అందులో సిద్దిపేట జిల్లాలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన ప్రతీరైతును ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, మండల నాయకులు, ఏవో జయంత్ కుమార్, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి'

నారాయణఖేడ్/కొండాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ప్రాంతంలో వడగళ్లతో కూడిన వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖేడ్ ప్రాంతంలో గురువారం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురియడంతో వందల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రధానంగా కల్హేర్ మండలం బీబీపేట్, ఖానాపూర్, క్రిష్ణాపూర్, మార్డి గ్రామాల్లో వరి నేలకు ఒరిగిందన్నారు. ప్రభుత్వం పొలాలను సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు వడగండ్లతో నష్టపోయిన మామిడి, కూరగాయల రైతులను అదుకోవాలని సీపీఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పండ్ల, కూరగాయల తోటలను సందర్శించి రైతులకు మనోధైర్యాన్ని నింపారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి యువకుడు మృతి


నరేష్(ఫైల్)

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి యువకుడు మృతిచెందిన సంఘటన కోహెడ మండలం శనిగరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి జెరిపోతుల ఎల్లవ్వకు ఐదుగురు కుమారులు. చిన్న కుమారుడు నరేష్(25)కు వివాహం కాకపోవడంతో తల్లితో కలిసి జీవిస్తున్నాడు. వీరికి మేకలు ఉండడంతో రోజులాగే వాటిని నరేష్ మేతకు తీసుకెళ్లాడు. శనిగరం రాజీవ్ రహదారి పక్కనగల 133 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో మేకల కోసం చెట్ల కొమ్మలు కొట్టి చేతితో గుంజుతుండగా పైన ఉన్న హైటెన్షన్ వైర్లకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్ గురై చేతులు, మెడ చుట్టూ తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల రైతులు స్థానిక సబ్‌స్టేషన్‌కు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి చూసేసరికి నరేష్ మృతిచెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోసముద్రం చెరువులో గుర్తు తెలియని శవం లభ్యమైన సంఘటన శుక్రవారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీసి పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఆరెంజ్ డబ్బాల షర్ట్, నల్లని ప్యాంట్ ఉన్నట్లు గుర్తించారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ దొరకడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- మాయమాటలు చెప్తాడు.. నగదు దోచుకుంటాడు
- పలు హత్య కేసుల్లో జైలుకు... విడుదల
- సీసీ కెమెరాల ఆధారంగా దొరికిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఒంటరి మహిళలే టార్గెట్

నర్సాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అతనొక సైకో.... కల్లు దుకాణాలకు వచ్చే ఒంటరి మహిళలే అతని టార్గెట్.. వారికి మాయ మాటలు చెప్పి తీసుకెళ్తాడు. నగదు, నగలు దోచుకుని హత్య చేస్తున్న సైకో కిల్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అయ్యగారిపల్లితండాకు చెందిన కేతావత్ గోపాల్ 2008 నుంచి కల్లు దుకాణాల వద్దకొచ్చే ఒంటరి మహిళలను టార్గెట్ చేయడం పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం జైరాంతండాకు చెందిన బుజిలీ(52) అనే మహిళ మార్చి 25న నర్సాపూర్‌కు వచ్చి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. స్థానిక కల్లు దుకాణం నుంచి ఓ వ్యక్తితో ఆటోలో వెళ్లినట్టు గుర్తించి, వెతకడం ప్రారంభించారు. నాలుగురోజుల తర్వాత నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డు సమీపం పట్టణ శివారులో గిరిజన గురుకుల పాఠశాల దాటిన తర్వాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో కుళ్లిన మృతదేహం లభ్యంకావడంతో.. అది బుజిలీదని కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు డీఎస్పీ, సీఐ, ఎస్ఐతో పాటు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఆటోలో తీసుకెళ్లిన వ్యక్తే హత్యచేసినట్టు గాలింపు చేపట్టారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం కూలీల అడ్డా వద్ద గోపాల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య ఉదయం బయటపడింది. గతంలో వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓ హత్య కేసులో పదేళ్ల శిక్ష కూడా పడింది. జైలు నుంచి వచ్చాక కూడా గోపాల్ ఒంటరి మహిళలకు మాయమాటలు చెప్పి హత్య చేసేవాడని ఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే బుజిలీని హత్య చేశాడని చెప్పారు. కాగా నెలరోజుల క్రితమే సదరు నిందితుడు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో కూడా హత్య కేసులో జైలుకెళ్లి వచ్చాడని చెప్పారు. ఇతడిపై పలు జిల్లాల్లో పది కేసులు ఉన్నాయి. ఒంటరి మహిళల వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు, నగదు కోసమే హత్యచేస్తూ సైకోగా తిరుగుతున్నాడని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

వేర్వేరుచోట్ల ఐదుగురి ఆత్మహత్య



స్వామి(ఫైల్), కొంగల సిద్దయ్య(ఫైల్)

ములుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మామిడ్యాలకు చెందిన జమాల్పూర్ స్వామి(23) ఈ నెల 4 కడుపు నొప్పి భరించలేక ఎవరికీ చెప్పకుండా నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు ఆర్వీఎం ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, కుమారుడు(3) ఉన్నారు. స్వామి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

చేగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాగాలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మండలం భీమ్‌రావ్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకున్నది. ఎస్ఐ అహ్మద్ మైనుద్దీన్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంగల సిద్ధయ్య(63) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సిద్ధయ్య శుక్రవారం తన వ్యవసాయ పొలం శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నరసమ్మ, కొడుకు నర్సింలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగుడు మానేయమన్నందుకు...

రాయపోల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానేయమని భార్య, కుమారుడు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లికి చెందిన కాకర్ల యాదయ్య(59) మొదటి భార్య మృతిచెందడంతో 25 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు నలుగురు ఆడపిల్లలు కాగా.. అందరి వివాహమైంది. రెండో భార్య ఐలవ్వకు కుమారుడు ఉన్నాడు. యాదయ్య రోజూ మద్యం తాగి ఇంటికొస్తున్నాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో ఆరోగ్యం చెడిపోతుందని భార్య, కుమారుడు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యాదయ్య శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కాకర్ల ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో కృష్ణంరాజు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

మిరుదొడ్డి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిరుదొడ్డి మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన మోహన్(50) మల్లికార్జునస్వామి ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం విధులకు హాజరై శుక్రవారం అడవిలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక..

చిన్నకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన రేపాక యాదవ్వ, రమేష్ దంపతులకు కుమారుడు రోహిత్(22), ఓ కూతురు ఉన్నారు. రోహిత్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మాస్టర్‌గా పని చేస్తుండేవాడు. తండ్రి, కుమారుడు కుటుంబ అవసరాల నిమిత్తం కొంత అప్పులు చేశారు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రోహిత్ భయాందోళనకు గురవడంతో పాటు, తరచూ మనస్తాపం చెందేవాడు. గురువారం అర్ధరాత్రి ఇంటికి వచ్చిన రోహిత్ ఓ గదిలో పడుకున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి డోర్ తీయడానికి ప్రయత్నించగా తెరచుకోలేదు. చుట్టుపక్కల వారి సాయంతో చూడగా రోహిత్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన రెండు ఇళ్లల్లో చోరీ


బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన బట్టలు

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన రెండిళ్లల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన గుంటి నరసింహ భార్యాపిల్లలతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. అయితే తల్లి లచ్చవ్వకు అరతులం బంగారం బీరువాలో పెట్టి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడంతో చుట్టుపక్కల వారు చూసి నరసింహకు సమాచారమందించారు. అతను వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో బంగారం కనిపించలేదు. అలాగే అదే గ్రామానికి చెందిన బైరి బాలవ్వ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10 వేలను అపహరించుకుపోయారు. బాలవ్వ కుమార్తెలు హైదరాబాద్‌లో ఉండడంతో కొద్దిరోజులుగా ఆమె అక్కడే ఉంటుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కోహెడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్ చోరీ చేసిన సంఘటన కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కొమ్మిడి బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉన్న 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు తోసేసి అందులోని విలువైన రాగి తీగలను తీసుకుని మిగిలిన భాగాలను పొలాల్లో వదలివెళ్లారు. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌పార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. 25 కేవీఏలో సుమారు రూ.55 వేల రాగి వైర్ ఉంటుందని ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు. విద్యుత్ అధికారుల సూచనల మేరకు బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దుర్గాభవానీ ఆలయంలో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్‌నాయక్

మునిపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామంలోని దుర్గాభవానీ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి అరకిలో వెండి కిరీటం, రెండు గ్రాముల బంగారు గొలుసులను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పూజారి మడపతి చంద్రమౌళి ఆలయానికి వెళ్లేసరికి అమ్మవారి వద్ద ఉండే వెండి, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ విషయాన్ని గ్రామపెద్దలకు తెలిపాడు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రాజేష్‌నాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న శ్రీరాం

పాపన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశమై పలు జాతీయ కార్యక్రమాల అమలు గురించి వివరాలు అరాతీశారు. ఆయన మాట్లాడుతూ... ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కావడంతో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు రికార్డులు పరిశీలించారు. వైద్యులు హరిప్రసాద్, అన్వర్, సీహెచ్‌వో చందర్, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు


కార్తిక్ రవికిరణ్ దేశ్‌ముఖ్, కమల్ సంజయ్ శిర్షత్

రామచంద్రాపురం/సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. వారికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ వస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్ జడ్జి మెజిస్ట్రేట్ కె.జయంతి శుక్రవారం తీర్పును వెల్లడించారు. మహారాష్ట్ర అమరావతి జిల్లాకు చెందిన కార్తీక్‌రవికిరణ్ దేశ్‌ముఖ్, కమల్ సంజయ్ శిరిషత్ 2023లో విశాఖపట్నం అరకు ఏజెన్సీ నుంచి 125 కిలోల గంజాయిని కారులో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఓఆర్ఆర్‌పై కాపు కాచి వారిని పట్టుకున్నారు. ఈ కేసులో వాదించిన రాజేశ్వర్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారులు కొల్లూరు సీఐలు సంజయ్‌కుమార్, కె.రవీందర్‌తో పాటు కోర్టు కానిస్టేబుల్ సీ.నర్సింహులు, ఏఎస్ఐ బి.రవీందర్‌రెడ్డి నిందితులకు శిక్ష పడటంలో ముఖ్యపాత్ర వహించారని పోలీసులు తెలిపారు.

విద్యార్థికి పాముకాటు


చికిత్స పొందుతున్న విద్యార్థి

పాపన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఒక బాలుడు పాము కాటుకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలుడు(7) ఉదయం పాఠశాలకు వెళ్లాడు. ఇంటర్వెల్ సమయంలో బయట ఆడుకుంటుండగా రక్తపింజర కాటు వేసింది. విద్యార్థి చేతినుంచి రక్తం కారడంతో కేకలు వేస్తూ ఏడవసాగాడు. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన మెదక్ ఆస్పత్రికి తరలించి. ఈ విషయాన్ని డీఈవో రాధాకిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే కలెక్టర్‌కు సమాచారం చేరవేశారు. కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలుడి పరిస్థితి మెరుగ్గానే ఉన్నదని ఉపాధ్యాయులు తెలిపారు.



మెదక్‌లో జ్యోతి బా పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ



చిట్కూల్‌లో కాంగ్రెస్ నాయకులు నీలం మధిరాజ్, తదితరులు



మెదక్ కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న రాహుల్‌రాజ్



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మహాత్మా జ్యోతి బా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఎంపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధి చిట్కూల్‌లో కాంగ్రెస్ నేత నీలం మధిరాజ్, మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిలు నివాళులు అర్పించారు.

ఎవరా వృద్ధురాలు..

వివరాలు సేకరిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు కుమారులు ఉన్నా.. 90 ఏళ్ల వయస్సులో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద దిక్కుతోచని స్థితిలో కనిపించిన వృద్ధురాలి వివరాలు సేకరిస్తున్నారు. ఆమెను ఆస్పత్రి వద్ద వదిలి వెళ్లిన వారు ఎవరు అన్న విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సదరు వృద్ధురాలికి సంబంధించిన వివరాలు తెలిస్తే నారాయణఖేడ్ ప్రాజెక్టు కార్యాలయంలో లేదా ఆయా మండలాల సూపర్‌వైజర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. త్వరలోనే వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే అద్దె గృహాల్లోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాప్టా.కె సెక్టార్‌లోని మొదటి అంగన్‌వాడీ సెంటర్‌ను అద్దె ఇంట్లోకి మార్చాలని సూచించామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే 9490664020కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సుజాత తెలిపారు.

బాలల కథల పోటీలో ప్రథమ బహుమతి

విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాల సాహిత్య పీఠం వారు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన బాలల కథల పోటీ- 2025లో జక్కుల లోహిత ప్రథమ అందుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జక్కుల లోహిత ఈ ఘనతను సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం లోహితను అభినందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 541 కథలు పోటీకి రాగా, లోహిత రాసిన 'ధూమపానం' కథ ప్రథమ బహుమతి సాధించిందన్నారు. కథలు రాయడంలో ప్రోత్సహించిన తెలుగు భాష ఉపాధ్యాయులు వరికోలి లక్ష్మయ్య, మాచిరాజు బాల సాహిత్య కళాపీఠం బాధ్యులు గరిపల్లి అశోకుడుని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.నాగేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, రమాదేవి, లక్ష్మయ్య, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు సుద్దాల అశోక్‌తేజ శ్రీశూద్ర గంగ కావ్య గానం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) సినీ గేయరచయిత డా. సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీ శూద్ర గంగ కావ్యగానం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి, సీనియర్ జర్నలిస్టు విష్ణుప్రసాద్ తెలిపారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి, తదితరులు హాజరతారని తెలిపారు.

గీతంలో ఔషధాల ఆవిష్కరణపై వర్క్‌షాప్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిత్య మిశ్రా

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం అధునాతన సాంకేతికత (మోల్‌సాఫ్ట్) సాయంతో ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధిపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'మాలిక్యులర్ డాకింగ్, వర్చువల్ స్క్రీనింగ్' పేరిట నిర్వహించిన ఈ ఒక రోజు వర్క్‌షాప్‌లో ప్రధాన శిక్షకులుగా పుణేలోని అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్ అప్లికేషన్ సైంటిస్టులు ఆదిత్య మిశ్రా, డాక్టర్ షంషేర్ సింగ్ సర్దార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్, డాక్టర్ ఎలగందుల సతీష్, డాక్టర్ వినాస్ మాయాస, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక యాత్రికుడు

కాలినడకన పుణ్యక్షేత్రాలకు..

ఖేడ్ నుంచి కాశీకి పాదయాత్ర

పదిమందితో మొదలై... నేడు వెయ్యి మంది

19 ఏళ్లుగా వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని హంక్రానాకు చెందిన వెంకటరమణారెడ్డి నిరూపిస్తున్నారు. ఆయన పుణ్యక్షేత్రాలకు పాదయాత్ర చేసుకుంటూనే వెళుతున్నారు. పాదయాత్ర చేయడం వల్ల ఆరోగ్యం, ఆధ్యాత్మికభావన పెరుగుతుందని ఆయన అంటున్నారు. 19 ఏళ్లగా దైవదర్శనాలకు పాదయాత్ర చేసుకుంటూనే వెళుతున్నామని వెంకటరమణారెడ్డి అంటున్నారు. తొలిసారిగా ఆయన పాదయాత్రగా 2006లో బయలుదేరగా, ఆయన వెంట పది మంది నడిచారు. ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకోవడం చాలా ఆనందంగా ఉన్నాదని ఆయన అంటున్నారు. ప్రత్యేక వాహనంలో వంటకు అవసరమయిన సరుకులు, పాత్రలు తీసుకెళుతున్నామని, దారిపొడవున దాతలు భోజనాలు, ఫలహారాలు అందించడమే కాకుండా తమకు మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నారని ఆయన చెప్పారు. యాత్రలో ఎవరికైనా ఏమయినా ఆరోగ్యసమస్యలు వస్తే వెంటనే చికిత్స చేయడానికి వారి వెంట పీఎంపీ వైద్యులు ఉన్నారని చెప్పారు. నారాయణఖేడ్ ప్రాంతం కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో వారీకార్ సాంప్రదాయ భక్తులు అధికంగా ఉన్నారు. వెంకటరమణారెడ్డి కూడా వారీకార్ భక్తుడే కావడంతో పండరీపూర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ క్షేత్రాలతో పాటు కాశీ క్షేత్రానికీ పాదయాత్రగా వెళ్లి దర్శించుకోవాలని సంకల్పించుకున్నారు.



పాదయాత్రగా వెళ్తున్న బృందం

ఏటా శివ దీక్ష

2006లో డి.వెంకటరమణారెడ్డి పాదయాత్ర చేసుకుంటూ వెళ్లి శ్రీశైలం మల్లికార్జునుడిని దర్శించుకుందామని దీక్ష చేపట్టిన సమయంలో పదిమంది మిత్రులు తోడైయారు. అదే స్ఫూర్తితో ప్రతీ సంవత్సరం శివదీక్ష చేస్తు శ్రీశైలానికి వందల మంది భక్తులతో కలసి పాదయాత్ర చేసి మల్లన్నను దర్శించుకుంటున్నారు. 2016లో వందమంది భక్తులతో కలిసి కాశీకి పాదయాత్రగా వెళ్లారు. నారాయణఖేడ్ నుంచి కాశీ 1200 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోజుకు 40 కిలోమీటర్ల చొప్పున కాశీకి వెళ్లడానికి 30 రోజుల పాటు పాదయాత్ర చేశారు. తిరుమలకు రెండుసార్లు పాదయాత్రగా వెళ్లారు. ఇటీవల కుక్కలదొడ్డి నుంచి అతికఠినమైన తుంబూర తీర్థం పాదయాత్ర చేసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సంవత్సరం శివరాత్రి సందర్భంగా చేసిన పాదయాత్రలో ఖేడ్ నుంచి 500 మంది భక్తులు పాల్గొనగా, శ్రీశైలం క్షేత్రానికి చేరుకునే వరకు 1000 మందికి చేరుకోవడం విశేషం. వెంకటరమణారెడ్డి బృందం చేసే పాదయాత్రలో పాల్గొని దైవదర్శనం చేసుకోవడానికి నారాయణఖేడ్ ప్రాంతంలోని భక్తులు పోటీ పడతారు. వీరి బృందం ఝరాసంగం సంగమేశ్వర దేవాలయానికి ఐదు సార్లు పాదయాత్ర నిర్వహించింది. వెంకటరమణారెడ్డి తన సొంత భూమిలో శివాలయాన్ని కట్టించారు. అందులో ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా పండరీపూర్‌లో కరణ్‌గజేంద్ర భారతిఆశ్రమం నిర్మాణంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.



పాదయాత్రగా వెళ్తున్న వెంకటరమణారెడ్డి బృందం

అందరి సహకారం వల్లే పాదయాత్ర



భక్తులందరూ సహాయసహకారాలు అందించడం వల్లే మేము 19 సంవత్సరాలుగా పాదయాత్రలతో దైవదర్శనాలకు వెళ్తున్నాం. ఏ క్షేత్రానికి వెళ్లినా రోజుకు దాదాపు 40 కిలోమీటర్ల చొప్పున ప్రయాణం చేస్తున్నాం. మాకు దారి పొడవున దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. భగవంతుడు మాకీ శక్తిని కలిగించడం వల్లే ఈ యాత్రలు చేయగలుగుతున్నాం.

\- వెంకటరమణారెడ్డి

వారికి వైద్య సేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉంది



పాదయాత్రలో దైవదర్శనానికి వెళ్తున్న వారికి ఎవరైనా భక్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే చికిత్స అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ యాత్రల ద్వారా మేము కూడా దైవదర్శనానికి వెళుతున్నాం. మా తోటి వారికి సహాయం చేయడం నిజంగా అదృష్టమని భావిస్తున్నాం.

\- పీఎంపీ వైద్యుడు అమృత్

కఠినమైన పాదయాత్రలతో ఆనందం



దైవ దర్శనాల కోసం పాదయాత్రలు చేయడం కఠినమైనప్పటికీ వందలాది మందితో కలిసి దైవదర్శనాలు చేసుకోవడం ఆనందం కలిగిస్తోంది. నేను వెంకటరమణారెడ్డి బృందంతో కొన్ని పాదయాత్రలకు కలిసి వెళ్లాను. ఆ అనుభూతి మరచిపోలేనిది.

\- రవీందర్‌నాయక్

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ జయంత

ప్రభుత్వ డిగ్రీ, మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా దేశానికి సేవ చేయడంతో పాటుగా ఉజ్వల భవిష్యత్, మంచి ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చని 9 (టీ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ వింగ్‌తో ఇంట్రాక్ట య్యారు. లెఫ్టినెంట్ కల్నల్ జయంతతోపాటు సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, జీసీఐ శివానీ, సుబేదార్ సూర్యప్రసాద్, పీఐ సిబ్బంది అన్మోల్‌సింగ్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరటం వలన శారీరక దృఢత్వంతోపాటు, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. నవ సమాజ నిర్మాణములో పాలుపంచుకోవడానికి సువర్ణావకాశం లభిస్తుందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికేట్ ద్వారా రాత పరీక్ష లేకుండానే ప్రత్యేక ఎంట్రీ ద్వారా ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలతో పాటు, త్రివిధ సాయుధ దళాలు, అగ్నివీర్ వంటి ఉద్యోగ ఉద్యోగాలు నేరుగా పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సునీత మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి.అయోధ్యరెడ్డి, కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ బి. కృష్ణయ్య, ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.బాలకిషన్, ఎన్‌సీసీ కేడెట్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని 9 (టీ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, జీసీఐ శివాని, సుబేదార్ సూర్యప్రసాద్, హవల్దార్ అమొల్ షిండే సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్యాము, ఎన్‌సీసీ కేర్ టేకర్ డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శ్వేత, డాక్టర్ సువర్ణాదేవి కిషోర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కెడెట్లతో లెఫ్టినెంట్ కల్నల్ జయంత

విధుల్లో చేరేందుకు వస్తే కార్యాలయానికి తాళం

సహకార సంఘం ముందు సీఈవో భోజనం



కొల్చారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): డీజీఓ ఆదేశాల మేరకు విధుల్లో చేరేందుకు వచ్చిన ఓ సీఈవో కార్యాలయానికి తాళం ఉండటంతో బయటే వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు వేచి చూసిన ఆయన ఆరుబయట భోజనం చేయాల్సి వచ్చింది. వివరాలు ఆయన మాటల్లోనే.. చిన్నఘనాపూర్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేసి విధుల నుంచి తొలగించారని, రెండేళ్ల పాటు కోర్టు చుట్టూ తిరిగితే విధుల్లో చేర్చుకోవాలని జిల్లా అధికారులను కోర్టు ఆదేశించింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సొసైటీకి వెళ్లగా, తాను విధుల్లో చేరేందుకు వస్తున్నానని కొందరు తాళం వేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం వరకు ఆరుబయటే వేచి చూసిన సీఈవో కార్యాలయం ముందే భోజనం చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలను చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాళ్లకల్‌లో నీటి ఎద్దడి

మనోహరాబాద్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నెల రోజుల నుంచి తాగునీరు రావడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరిగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని కార్యదర్శి ప్రియాంకకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కాలనీలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలనీలో కొంతమంది కలిసి రూ. 1,500లకు ఒక ట్యాంకర్ చొప్పున నీరు తెప్పించుకుంటున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళ

తాగునీటి సమస్య రావొద్దు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా అన్నారు. శుక్రవారం జిల్లాలోని డీఎల్‌పీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండుఎండల కారణంగా కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే నీటి సరఫరా కోసం ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్డినెన్స్ ఉద్యోగుల నిరసన

కంది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలని సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం వద్ద నున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని అన్ని యూనియన్లకు చెందిన ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు తీర్చాలని సోమవారం నుంచి శుక్రవారం వరకు శాంతియుత నిరసనలు తెలిపారు. విధుల్లోకి వచ్చిన ఉద్యోగులు అందరూ ప్రతీ రోజు క్రమం తప్పకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం శివశంకర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

'డబుల్' ఇళ్లలో నిరుపేదలు

కేటాయించక ముందే నివాసం

ఖాళీ చేయాలన్న తహసీల్దార్



చేగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలు కొందరు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనధికారికంగా నివాసం ఉంటుండంతో తహసీల్దార్ శ్రీకాంత్ ఇళ్లు ఖాళీ చేయాలని సూచించారు. మండ ల కేంద్రంలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించినా ఎవరికీ కేటాయించలేదు. దీంతో కొందరు ఆ ఇళ్లలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసి శుక్రవారం తహసీల్దార్ అక్కడికి వెళ్లి.. వారితో సమావేశమయ్యారు. అనధికారికంగా ఇళ్లలో ఉండకూడదని, వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. తాము అద్దె ఇళ్లలో ఉంటున్నామని, అద్దె కట్టుకోలేని పరిస్థితుల్లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఉంటున్నామని వివరించారు. అర్హులైన తాము దరఖాస్తు చేసుకున్నా ఇళ్లు కేటాయించలేదని, ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తి లేదని భీష్మించుకూర్చున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని, చిన్న చిన్న పనులు ఉన్నాయని వాటిని మరమ్మత్తులు చేసిన తర్వాత త్వరలోనే అందిస్తామని తహసీల్దార్ చెప్పారు. వారంలోగా ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. అయినా, అక్కడి వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

● సీపీ డాక్టర్ బి.అనురాధ



పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లతో సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ దుధ్యానాయక్, గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా శుక్రవారం వారు సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని అభినందించారు. రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రజనీకాంత్‌రెడ్డి, సీసీ నితిన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన నూతన డీటీవో



డీటీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.క్రిస్టఫర్ శుక్రవారం సీపీ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సీపీ ఆయనను అభినందించి విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

'వికాసం'కు విఘ్నాలు

మొరాయిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం సర్వర్
కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీకి తప్పని సమస్య
నేటి నుంచి మూడు రోజుల పాటు సెలవులు
14వ తేదీ వరకే చివరి గడువు



అక్కన్నపేటలో మీ సేవ కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

అక్కన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజీవ్ యువ వికాస పథకంలో రాయితీ రుణాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన యువతి, యువకులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు గడవును ఇప్పటికే ఏప్రిల్ 14కు పెంచినప్పటికీ యువతకు ఇబ్బందులు తప్పడం లేదు.

యువ వికాసం పథకానికి దరఖాస్తు చేయాలంటే ఆదాయ, కుల ధ్రువపత్రాలు జత చేయాలనే నిబంధనను విధించడంతో యువత ఈ ధ్రుపత్రాల కోసం మీసేవ సెంటర్లు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, శనివారం నుంచి మూడు రోజులపాటు సెలవులు రాగా, రాజీవ్ యువ వికాసం పథకానికి 14వ తేదీ చివరి గడువు కావడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వస్తాయోరావోనని ఆందోళనకు గురవుతున్నారు. సర్వర్ సమస్యలతో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీకి తీవ్ర జాప్యం జరుగుతోంది. అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రభావం సర్వర్‌పై కనిపిస్తున్నదని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సర్వర్ డౌన్

కులం, ఆదాయం, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్, ఇలా అన్ని రకాల పత్రాలు ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లకు భారీగా రావడంతో రాజీవ్ యువ వికాసం పథకం సర్వర్ మొరాయిస్తుంది. రెండు రోజుల నుంచి ఆన్‌లైన్ చేసుకునేందుకు మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల వద్ద యువత భారీ ఎత్తున క్యూ కడుతున్నది. మూడు రోజుల్లో దరఖాస్తు గడువు ముగియనుండడంతో మరోసారి పొడిగించాలని కోరుతున్నారు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలి

● ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు



మైసమ్మవాగు తండాలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న అధికారులు

అక్కన్నపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లి, గండిపల్లి, మైసమ్మవాగుతండాలో కూరగాయల పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీగ పద్ధతిలో కూరగాయలు పండించడం ద్వారా రైతులు తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందుతారని సూచించారు. సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఉన్నారు.

గజ్వేల్‌లో సీఎం దిష్టిబొమ్మ శవయాత్ర

గజ్వేల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బీజేపీ నాయకులు శవయాత్ర నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని నిరసిస్తూ గజ్వేల్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహించి, దగ్ధం చేసినట్లు బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ బండారి మహేశ్ తెలిపారు. గజ్వేల్ సీఐ సైదా అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయిల మహేందర్, రాజశేఖర్‌రెడ్డి, బారు అరవింద్, సిల్వేరి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ సమస్యలు లేకుండా చూడాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



సిద్దిపేటలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) చాంబర్‌లలో సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. యూజీడీలలో ప్లాస్టిక్ కవర్లు, సిల్ట్ పేరుకుపోయి నీరు నిలిచిపోవడం గమనించి వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని నివాస ప్రాంతాల వద్ద ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 22 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, గజ్వేల్ పట్టణ పరిధుల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 22 మందికి శుక్రవారం కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. సిద్దిపేటలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఏడుగురు మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా ఏడుగురికి రూ.16,000 జరిమానా విధించారు. గజ్వేల్ పట్టణంలో పట్టుబడ్డ 15 మందిని అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. వారికి రూ. 7500 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం : ఎంపీ

మిరుదొడ్డి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ కార్యకర్త గోత్రాల నరేష్ తండ్రి ఇటీవల మృతిచెందాడు. శుక్రవారం కార్యకర్త కుటుంబాన్ని ఎంపీ రఘునందన్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని ఎంపీ హామీ ఇచ్చారు.

చేర్యాల ఎమ్మార్సీ కార్యాలయానికి కుర్చీల విరాళం

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య చేర్యాల మండల విద్యావనరుల కేంద్రానికి 25 కుర్చీలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఈవో రచ్చ కిష్టయ్య సమక్షంలో అందజేయగా, అతడిని శాలువాతో సత్కరించారు.

అఖిలభారత కిసాన్‌సభ ఆవిర్భావ దినోత్సవం

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కిసాన్‌సభ ఆవిర్భావ దినోత్సవాన్ని చేర్యాలలో రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కాశెట్టి అంజనేయులు కిసానసభ పతాకాన్ని ఆవిష్కరించారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ కిసాన్‌సభ పతాకాన్ని ఆవిష్కరించారు.

ముగ్గురికి రిమాండ్

ములుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంటిమామిడిలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు పశువుల దొంగలు పట్టుబడినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని క్షీరాసాగర్ గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్(35), రాయపోల్ మండలం వడ్డెపల్లికి చెందిన కాశ కృష్ణ(32), తూప్రాన్ మండలం వెంకటాయపల్లికి చెందిన అశోక్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు



పూలే జయంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి బీసీ చైతన్య సదస్సు ర్యాలీని నిర్వహిస్తున్న నాయకులు

దార్శనికుడు జ్యోతిబాపూలే

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సిద్దిపేట పట్టణంలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి



మర్కూక్‌లో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే బహుజనుల అభివృద్ధికి దశ, దిశ తానై నిలిచిన గొప్ప దార్శనికుడు, సంఘసంస్కర్త అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి వేడుకలను సిద్దిపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బక్కి వెంకటయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డీఆర్వో నాగరాజమ్మ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ విద్య, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. ప్రతి మహిళా చదువుకోవాలని సంకల్పంతో ఆయన ముందడుగు వేశారని, అదే సంకల్పంతో సావిత్రిబాయికి చదువు చెప్పి దేశంలోనే మొట్టమొదటి మహిళా టీచర్‌గా తీర్చిదిద్దారని కొనియాడారు. నేటి యువత మహోన్నత వ్యక్తుల ఆశయాలను కొనసాగించే దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అధికారికంగా నిర్వహిస్తున్న జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమంలో ఫ్లెక్సీపై ఎంపీ రఘునందన్‌రావు ఫొటో లేదంటూ బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

న్యూస్‌నెట్‌వర్క్ : జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, విద్యాసంస్థల్లో జ్యోతిబా పూలేకు ఘన నివాళులర్పించారు. సిద్దిపేటలోని పూలే విగ్రహనికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



కొండపాక : వెలికట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని మర్పడగ, వెలికట్ట, సిరసనగండ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, వ్యవసాయ శాఖ ఏఈవో రమ్య, తదితరులు పాల్గొన్నారు. జప్తినాచారం, గిరాయిపల్లి, ఖమ్మంపల్లి, రాంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర : ఎమ్మెల్సీ

గజ్వేల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని బయ్యారం, బెజుగామ, శ్రీగిరిపల్లి, అక్కారం గ్రామాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

మిరుదొడ్డి, నారాయణరావుపేట మండలాల్లో

మిరుదొడ్డి/సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం రఘోత్తంపల్లి, రామక్కపేట, ఆకారం గ్రామాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట, మల్లాయిపల్లి వార్డుల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, డైరెక్టర్ బాల్‌రాజు తదితరులున్నారు. నారాయణరావుపేట మండలం మల్యాల, మాటిండ్లలో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ములుకల కనకరాజు ప్రారంభించారు.

తరుగు పేరిట దోపిడీ చేస్తే సహించేది లేదు

హుస్నాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట రైతులను మోసం చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడారు. బహిరంగ కొనుగోళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దు : చేర్యాల ఎస్ఐ

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని చేర్యాల ఎస్ఐ నీరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా సహకరించాలని కోరారు.

'మోడల్ స్కూల్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

బెజ్జంకి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తల్లిదండ్రులు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. 'విద్యార్థులకు మోకాళ్ల దండన' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తను ఎంఈవో తల్లిదండ్రులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. మోడల్ స్కూల్‌లో ప్రతిరోజు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థులు ఇంటికి వచ్చిన తర్వాత చెబుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాధికారికి, కలెక్టర్‌కు, విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు మోడల్ స్కూల్ పాఠశాలకు చెందిన విద్యార్థి తండ్రి బొనగం రమేష్ తెలిపారు. జరిగిన సంఘటనపై విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత పశు వైద్య శిబిరం

చిన్నకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్లాపూర్ శివారు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో, పశు సంవర్ధక శాఖ వారి సహకారంతో శుక్రవారం రామంచ గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో(ఎన్ఎస్ఎస్) భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 1,500 జీవాలకు (గొర్రెలు, మేకలకు) ఉచితంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాం, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుద్దాల చంద్రయ్య, ఎండీ అన్వర్, బీలునాయక్, మధుకర్‌రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు



గరుడ వాహనంపై లక్ష్మీనృసింహుడు

బెజ్జంకి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి గరుడ వాహనం సేవను నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్న శకటోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

గిరిపల్లి, పొన్నాలలో పోషణ పక్వాడ్



గజ్వేల్ : గిరిపల్లిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో సరిత

సిద్దిపేట అర్బన్/గజ్వేల్ అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ మండలం గిరిపల్లిలో ఐసీడీఎస్ సీడీపీవో ఎల్.సరిత, సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో సీడీపీవో శారద ఆధ్వర్యంలో శుక్రవారం సెక్టార్ స్థాయి పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిపల్లిలో గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రాధాన్యంను, పిల్లలకు తల్లి ప్రాముఖ్యాన్ని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో గర్భిణులు, బాలింతలు ఒక పూట సంపూర్ణ భోజనం పథకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి : బీజేపీ

ములుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని పార్టీ రాష్ట్ర నాయకుడు వెంకటరమణ సూచించారు. శుక్రవారం ములుగులో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లే శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు వెంకటరమణ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి కట్ట భాగ్యలక్ష్మి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల 'గావ్ చలో బస్తీ చలో'

చేర్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రం, రేషన్ దుకాణాలను సందర్శించారు.

పోటీ పరీక్షలపై అవగాహన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, కళాశాల ప్రిన్సిపల్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



చేర్యాల : కొమురవెల్లిలో పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల/మద్దూరు/చిన్నకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాలకు చేయూతనందిస్తూ, సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ ముగింపు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడటం కోసం కాంగ్రెస్ పాటుపడుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులెన్ని ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి, మద్దూరు, సలాఖ్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం ఆధ్వర్యంలో యాత్రను నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి మండల కోఆర్డినేటర్ సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, మెట్టుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుడు మీసం మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్‌లు సాకి ఆనంద్, మహమ్మద్ షాబోద్దీన్, నాయకులు కొరిమి రాజు, బత్తిని గణేష్, స్వామి, రాజు, వెంకట్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.